సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
మంగళవారం । 1 । ఏప్రిల్ । 2025



టన్ను చీనీ రూ.26,300
అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.26,300, కనిష్టంగా రూ.5 వేల ప్రకారం ధర పలికాయి.



రైతు కన్నీరు
భూగర్భజలమట్టం దారుణంగా పడిపోగా, చీనీ, మామిడి, అరటి చెట్లు నిలువునా ఎండిపోతున్నాయి. ఏం చేయాలో తెలియని రైతుకు కన్నీరు మిగులుతోంది. 8లో

గరిష్టం/కనిష్టం
39.8°/18.6°
జిల్లా పరిధిలో సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఎండ వేడి పెరిగింది. గంటకు 8 నుంచి 12 కిలో మీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

'ఫ్యాప్టో' జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక



గజ్జల హరిప్రసాద్‌రెడ్డి
ఫ్యాప్టో జిల్లా చైర్మన్



గౌస లాజమ్
జనరల్ సెక్రటరీ

పుట్టపర్తి: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నట్లు సమాఖ్య ప్రతినిధులు తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా గజ్జల హరి ప్రసాద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గౌస్ లాజం, కోశాధికారిగా భాస్కర్‌రెడ్డి, ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రతినిధులు పేర్కొన్నారు. కార్యవర్గంలో వివిధ సంఘాల నేతలకు చోటు కల్పించామన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి..
కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులకు బకాయిగా ఉన్న రూ.20 వేల కోట్లను వెంటనే జమ చేయాలని ఫ్యాప్టో జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సమస్యలపై రాబోవు రోజుల్లో రాజీలేని పోరాటం చేస్తామన్నారు. నూతన పీఆర్సీ కోసం కమిటీ వేయాలని, 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, జీఓ 117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

రేపు కలెక్టర్ వద్ద ధర్నా..
ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో కూటమి సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ఇందుకు నిరసనగా ఈ నెల 2వ తేదీ బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమం తలపెట్టినట్లు ఫ్యాప్టో నూతన జిల్లా అధ్యక్షుడు గజ్జల హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలి వచ్చి ధర్నాను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

నేటి నుంచి సీనియర్ ఇంటర్ తరగతులు

- మండుటెండల్లో కళాశాలల నిర్వహణపై సర్వత్రా విమర్శలు

పుట్టపర్తి: భానుడి భగభగలతో ఎండలు మండిపోతున్నాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల మార్కు దాటగా జనం అల్లాడిపోతున్నారు. ఇంట్లోంచి కాలు బయటపెట్టేందుకు జనం భయపడిపోతున్నారు. పాఠశాల విద్య అధికారులు ఒంటిపూట బడులు నిర్వహిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఇంటర్ బోర్డు అధికారులు సెకండ్ ఇయర్ తరగతులు మంగళవారం నుంచి ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. మొదటి సంవత్సరం మూల్యాంకనం ఇంకా పూర్తి కాకుండానే రెండో సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభిస్తున్నారు. దీనిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఉదయం 9 నుంచి సాయంత్రం వరకూ
మంగళవారం నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం తరగతులు ప్రారంభమవుతాయని జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి రఘునాథరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు కళాశాలలు నడుస్తాయన్నారు. జిల్లాలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న 13,083 మంది విద్యార్థులు కళాశాలకు హాజరు కావాల్సి కావాల్సి ఉంటుందన్నారు. ఇక ఇంటర్ ఫస్ట్ ఇయర్ ప్రవేశాలు కూడా ప్రారంభమవుతాయన్నారు.

పురివిప్పిన పరిటాల ఫ్యాక్షన్!



జిల్లాలో ఫ్యాక్షన్ భూతం మళ్లీ పడగ విప్పింది. రాజకీయ పబ్బం కోసం పచ్చని పల్లెల్లో అగ్గి రాజేస్తూ.. నిత్యం గొడవలు సృష్టిస్తున్న వైనం పాత 'రక్తచరిత్ర' రోజులను గుర్తుకు తెస్తోంది. రెండు దశాబ్దాల క్రితం పరిటాల రవి ఆధ్వర్యంలో ఆర్‌ఓసీ పేరుతో జరిగిన దమనకాండ మళ్లీ ఇప్పుడు జరుగుతోందనే చర్చ జనంలో మొదలైంది. తాజాగా పాపిరెడ్డిపల్లికి చెందిన లింగమయ్య హత్య ఉమ్మడి జిల్లాను ఒక్కసారిగా ఉలికిపాటుకు గురిచేసింది. లింగమయ్యను స్వయానా పరిటాల సునీత బంధువులే చంపినట్టు తేలింది. 2019–2024 మధ్య వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో ఫ్యాక్షన్ ఛాయలనేవే లేకుండా చేస్తే.. నేడు కూటమి ప్రభుత్వంలో 'పచ్చ' నేతలు ఊరూరా గ్రూపులను ప్రోత్సహిస్తూ ప్రత్యర్థులను మట్టుబెట్టే పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది.

పోలీసులు నిశ్చేష్టులై..

అరాచకాలు అంతులేని విధంగా జరుగుతున్నా ఇటు అనంతపురం, అటు శ్రీ సత్యసాయి జిల్లాల పోలీసులు నిశ్చేష్టులై చూస్తుండటంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. తాడిపత్రి, రాప్తాడు నియోజకవర్గాల్లో పరిస్థితులు పూర్తిగా అదుపు తప్పినా ఎస్పీలు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. ఈ క్రమంలో రాజకీయ నేతల అడుగులకు ఖాకీలు మడుగులొత్తుతున్నారన్న విమర్శలున్నాయి. రెండు జిల్లాల్లోనూ ఏమాత్రమూ సాధారణ పరిస్థితులు లేవని, పోలీసులు రాజకీయ నాయకులకు జీ హుజూర్ అంటుండటంతో టీడీపీ మూకలు రెచ్చిపోతున్నాయని సామాన్యులు వాపోతున్నారు.

అడ్డొస్తే హతమే..
- వైఎస్సార్ సీపీ హయాంలో ఐదేళ్లూ ప్రశాంతంగా పల్లెలు
- కూటమి సర్కారులో దమనకాండ
- గ్రామాల్లో పరిటాల అనుచరుల వీరంగం
- ఎదురు తిరిగితే గొడ్డళ్లు, వేటకొడవళ్లతో దాడులు
- పరిటాల రవి హయాంలో జరిగిన హత్యాకాండను గుర్తుకు తెస్తున్న వైనం



ఎమ్మెల్యే పరిటాల సునీత బంధువుల దాడిలో మృతి చెందిన కురుబ లింగమయ్య (ఫైల్)

సాక్షి ప్రతినిధి, అనంతపురం: సార్వత్రిక ఎన్నికల్లో పరిటాల సునీత ఎమ్మెల్యేగా గెలవడం, రాష్ట్రంలో కూటమి సర్కారు కొలువుదీరినప్పటి నుంచి రాప్తాడు నియోజకవర్గంలో అరాచకాలకు అంతు లేకుండా పోయింది. ఎక్కడ ఖాళీ స్థలాలు కనిపించినా, సెటిల్‌మెంట్‌లు ఉన్నా పరిటాల అనుచరులు వాలిపోతున్నట్టు నియోజకవర్గంలో చర్చ జరుగుతోంది. భూముల కబ్జాలు, బెదిరింపులు, వసూళ్లు ఒకెత్తయితే... హత్యలు మరోఎత్తు. తమకు ఎదురుతిరిగితే చాలు కొడవళ్లు, గొడ్డళ్లతో దాడులు చేస్తూ భయకంపితుల్ని చేస్తున్నారు.

అప్పట్లో ఆర్వోసీ పేరుతో..
పరిటాల సునీత భర్త పరిటాల రవి బతికున్న కాలంలో ఆర్‌ఓసీ (రీ ఆర్గనైజేషన్ కమిటీ) పేరుతో జరిగిన హత్యలకు లెక్కలేదు. వందల మందిని చంపేసి ఆచూకీ లేకుండా చేశారన్న ఆరోపణలున్నాయి. రవిని ఎదిరించడం కాదు, ఆ ఆలోచన వచ్చినా అలాంటి వారిని తెల్లారేసరికి లేకుండా చేసేవారని, 'ఆర్వోసీ' దాష్టీకానికి 700 మందికి పైగా బలై ఉంటారని అప్పట్లో రవి అనుచరులుగా ఉన్న వాళ్లే చెబుతున్నారు.

ఈ హత్యల వెనుకా పరిటాల అనుచరులే!
- 2015 ఏప్రిల్ 29న పట్టపగలే రాప్తాడు తహసీల్దార్ కార్యాలయంలో మాజీ ఎంపీపీ భూమిరెడ్డి ప్రసాదరెడ్డిని దారుణంగా నరికి చంపారు. పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ఈ హత్య అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. రాజకీయంగా అడ్డుగా ఉన్నాడని ప్రసాద్ రెడ్డిని పరిటాల అనుచరులు మట్టుబెట్టినట్టు విమర్శలున్నాయి.
- 2018 మార్చి 30న అనంతపురం రూరల్ మండలం కందుకూరులో శివారెడ్డిని దారుణంగా నరికి చంపారు. గ్రామంలో తాగునీటి ఇబ్బందులు లేకుండా ట్యాంకర్లతో నీళ్ల సరఫరా చేసి మంచి పేరు తెచ్చుకున్న శివారెడ్డిని చంపడాన్ని గ్రామస్తులు జీర్ణించుకోలేకపోయారు. ఈ కేసులో ఇటీవలే ఐదుగురు ముద్దాయిలకు జిల్లా కోర్టు 'డబుల్' యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ సంచలన తీర్పు వెలువరించింది. కేసులో రాజీకి రావాలని మృతుడి బంధువులను బెదిరించారంటే ఏస్థాయిలో బరితెగించారో అంచనా వేయొచ్చు.
- గత ఏడాది అక్టోబర్ 10న వైఎస్సార్‌సీపీకి చెందిన గూలి కేశవరెడ్డిని హత్య చేశారు. హత్యలు చేస్తే తమకు ఇక ఎవరూ ఎదురు రారనే ఉద్దేశంతో దారుణానికి ఒడిగట్టారని తెలిసింది. ఇటీవల ఆత్మకూరు మండలం సిద్దరాంపురంలో బాలన్న అనే వ్యక్తిపై పరిటాల సునీత సమీప బంధువులు హత్యాయత్నం చేశారు. తాజాగా పాపిరెడ్డి పల్లికి చెందిన లింగమయ్యపై దాడి చేసి చంపారు. హంతకులు సునీతకు దగ్గరి బంధువులు కావడం గమనార్హం. రామగిరి ఎంపీపీ ఎన్నికల విషయంలో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా లింగమయ్య ఉన్నాడనే అక్కసుతో హతమార్చారని తేలింది.

బీసీలపై దాడులకు మంత్రి సమాధానం చెప్పాలి

- బీసీలకు రక్షణ కల్పించలేని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత
- వెంటనే తన పదవికి రాజీనామా చేయాలి
- జిల్లాలో కురుబలపై వరుస దాడులు దుర్మార్గం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్



సాక్షి పుట్టపర్తి: జిల్లాలో బీసీలపై జరుగుతున్న దాడులకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత బాధ్యత వహించాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీ చరణ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆమె పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఓ లేఖను విడుదల చేశారు. జిల్లాలో వరుసగా బీసీలపై, ముఖ్యంగా కురుబలపై దాడులు జరగడం దారుణమన్నారు. ఇటీవల పేరూరుకు చెందిన లాయర్ కురుబ నాగిరెడ్డిపై కొందరు అనాగరికంగా దాడి చేశారన్నారు. అలాగే సిద్దరాంపురంలో కురుబ బాలన్నపై దాడి చేసిన ఘటన గుర్తు చేశారు. రామగిరి మండలంలోని పాపిరెడ్డిపల్లిలోనూ ఆదివారం కురుబ లింగమయ్య కుటుంబ సభ్యులపై అనాగరికంగా దాడి చేస్తే, లింగమయ్య ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. జిల్లాలో వరుసగా జరుగుతున్న హింసాత్మక ఘటనలు కురుబ సామాజిక వర్గానికి చెందిన బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితకు పట్టవా...అని ప్రశ్నించారు. కనీసం బాధిత కుటుంబాలను పరామర్శించే తీరిక కూడా ఆమెకు లేకపోవడం అన్యాయమన్నారు. జిల్లాలో కురుబలపై జరుగుతున్న అనాగరికమైన ఘటనలకు మంత్రి సవిత బాధ్యత వహించాలన్నారు. కురుబ కులస్తులపై ఏ మాత్రం ప్రేమ, బాధ్యత ఉన్నా .. మంత్రి తన పదవికి రాజీనామా చేసి బాధితుల తరఫున నిలబడాలని డిమాండ్ చేశారు.

ప్రశ్నిస్తే చంపేస్తారా?

- పరిటాల సునీత, శ్రీరామ్ డైరెక్షన్‌లోనే లింగమయ్య హత్య
- అధికారంలోకి వస్తే వడ్డీతో సహా చెల్లిస్తాం
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్
- అంత్యక్రియలకు వెళ్తున్న మాధవ్‌ను అడ్డుకున్న పోలీసులు



మాధవ్ ఇంటి నుంచి బయటకు వెళ్తుండగా అడ్డుకుంటున్న పోలీసులు

అనంతపురం ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వంలో ప్రశ్నిస్తే చంపేస్తారా అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్ మండిపడ్డారు. కురుబ లింగమయ్య అంత్యక్రియల్లో పాల్గొనేందుకు సోమవారం రామగిరి మండలం పాపిరెడ్డిపల్లికి బయలుదేరిన ఆయనను అనంతపురంలోని ఇంటివద్ద పోలీసులు అడ్డుకున్నారు. హౌస్ అరెస్టు చేసి నోటీసు అందజేశారు. ఈ క్రమంలోనే పార్టీ శ్రేణులు అక్కడికి భారీగా చేరుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ సందర్భంగా విలేకరులతో గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ గత ఐదేళ్లూ రాప్తాడు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి గొడవలు, హత్యా రాజకీయాలను ప్రోత్సహించకుండా పాలన సాగిస్తే పరిటాల సునీత ఎమ్మెల్యే అయిన తర్వాత హత్యా రాజకీయాలకు తెర లేపారని విమర్శించారు. ఒక బీసీ నాయకుడిని అత్యంత దారుణంగా కొట్టి హతమార్చారన్నారు. వీటన్నింటికీ తగిన మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు. 'మళ్లీ ఎన్నికల్లో వైఎస్ జగన్ ఓడేదీ లేదు, చంద్రబాబు గెలిచేదే లేదు' అని స్పష్టం చేశారు.

రాష్ట్రాన్ని రావణకాష్టంగా మార్చారు..
ఐదేళ్ల వైఎస్ జగన్ పరిపాలన రామరాజ్యం గుర్తుకు తెచ్చిందని మాధవ్ పేర్కొన్నారు. అలాంటి రామరాజ్యాన్ని చంద్రబాబు సీఎం అయిన తర్వాత రావణకాష్టంగా మార్చారన్నారు. హత్యలు, దాడులు, మానభంగాలు, దోపిడీలు, దౌర్జన్యాలతో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదన్నారు. తప్పుడు కేసులు బనాయిస్తూ అక్రమంగా అరెస్ట్‌లు చేస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యవాదులపై, ప్రశ్నించేవారిపై, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దౌర్జన్యాలు, హత్యలు, హత్యాయత్నాలు జరుగుతున్నాయన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తూ ప్రజాస్వామ్యవాదుల గొంతునొక్కే ప్రయత్నం చేస్తున్న ప్రభుత్వంపై ప్రజలు తిరగబడతారన్నారు.

పరిటాల సునీత, శ్రీరామ్ డైరెక్షన్‌లో హత్యలు
రాప్తాడు నియోజకవర్గంలో పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ డైరెక్షన్‌లో హత్యలు, హత్యాయత్నాలు జరుగుతున్నాయని మాధవ్ అన్నారు. ఇటీవల ఆత్మకూరు మండలం సిద్దరాంపురంలో బాలన్న అనే వ్యక్తిని పరిటాల సునీత సమీప బంధువులు హత్య చేసేందుకు యత్నించారని, ఆ ఘటన మరువకముందే పాపిరెడ్డిపల్లిలో కురుబ లింగమయ్యను సునీత దగ్గర బంధువులు హత్య చేశారన్నారు. లింగమయ్య కుమారులను కూడా హత్య చేయాలని చూస్తే వారు తప్పించుకున్నారన్నారు. ప్రభుత్వానికి నూకలు చెల్లే రోజులు దగ్గరలోనే ఉన్నాయని, తాము అధికారంలోకి రాగానే వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తామని, చర్యకు ప్రతి చర్య ఉంటుందని స్పష్టం చేశారు.

'ఏడు'పిస్తున్న బాబు



ఎండిన పప్పుశనగ పంట (ఫైల్)

- రబీ కరువు జాబితాలో ఈ సారీ ఏడు మండలాలే
- ఉత్తర్వులు జారీ చేసిన చంద్రబాబు ప్రభుత్వం
- గత ఖరీఫ్, రబీలో పంటల నష్టానికి ఇప్పటికీ 'ఇన్‌పుట్' ఇవ్వని వైనం

అనంతపురం అగ్రికల్చర్: ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కారు గత పది నెలలుగా ఎలాంటి సాయం చేయకుండా రైతులను ఏడిపిస్తోంది. గత ఖరీఫ్‌లో జిల్లా అంతటా 3.20 లక్షల హెక్టార్లలో పంటలు దారుణంగా దెబ్బతిన్నా... కరువు జాబితాలో కేవలం ఏడు మండలాలను ప్రకటించి రైతును దగాకు గురి చేశారు. తాజాగా ప్రస్తుత రబీకి సంబంధించి ఏడు మండలాలను కరువు జాబితాలో చేరుస్తూ సోమవారం రెవెన్యూ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. వర్షపాతం, పంటల సాగు విస్తీర్ణం, దిగుబడులు, ఉష్ణోగ్రతలు, గాలిలో తేమశాతం, చీడపీడలు తదితర కొలమానాల ఆధారంగా జాబితా ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్సార్, కర్నూలు, నంద్యాల, ప్రకాశం జిల్లాల పరిధిలో 51 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించారు. అందులో 37 మండలాలు తీవ్ర కరువు, మరో 14 మండలాలు సాధారణ కరువు (మోడరేట్) జాబితాలోకి చేర్చి ఉత్తర్వులు ఇచ్చారు.

'శ్రీ సత్యసాయి'లో ఒకటే..
అనంతపురం జిల్లాకు సంబంధించి బెళుగుప్ప, గుంతకల్లు, పెద్దవడుగూరు, తాడిపత్రి, యల్లనూరు, యాడికి మండలాలు తీవ్ర కరువు జాబితాలో ఉండగా విడపనకల్లును సాధారణ కరువు జాబితాలో చేర్చారు. శ్రీ సత్యసాయి జిల్లాలో కేవలం రొద్దం మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించారు. అనంతపురం జిల్లాలో ప్రధానంగా ఉరవకొండ, వజ్రకరూరు, పుట్లూరు తదితర మండలాల్లో పప్పుశనగ అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. అలాంటి మండలాలను పక్కన పెట్టడంపై రైతులు మండిపడుతున్నారు. ఓవరాల్‌గా ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో అక్టోబర్‌లో 100.9 మి.మీ గానూ 135.1 మి.మీ వర్షం కురిసింది. నవంబర్‌లో 28.6 మి.మీ గానూ 18.1 మి.మీ, డిసెంబర్‌లో 9.8 మి.మీ గానూ 17.3 మి.మీ వర్షం కురిసింది. మొత్తమ్మీద రబీలో 139.3 మి.మీ గానూ 22.5 శాతం అధికంగా 170.6 మి.మీ వర్షం పడింది. వర్షపాతం కాస్తంత అధికంగా నమోదైనా వర్షపు రోజులు (రెయినీ డేస్) కేవలం 13 నమోదు కావడం గమనార్హం. దీంతో పంటల సాగు అతికష్టమ్మీద సాగింది. రబీలో 1,18,330 హెక్టార్లకు గానూ 67 శాతంతో 79,360 హెక్టార్లలో మాత్రమే పంటలు వేశారు. అందులో ప్రధానపంట, వర్షాధారంగా వేసే పప్పుశనగ 50 వేల హెక్టార్లలో సాగైంది. ఆ తర్వాత జొన్న, మొక్కజొన్న, ఉలవ తదితర పంటలు కొంత విస్తీర్ణంలో సాగులోకి వచ్చాయి. పంట దిగుబడుల విషయంలో జిల్లా అంతటా ఒకే రకంగా ఉన్నా... కరువు జాబితాలో మాత్రం కేవలం ఏడింటిని చేర్చడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వకుండా..
2023 రబీలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 17 కరువు మండలాలకు సంబంధించి రూ.37 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ ఇప్పటికీ ఇవ్వలేదు. అలాగే గత రబీ అంటే చంద్రబాబు సర్కారు హయాంలో ఏడు మండలాల రైతులకు రావాల్సిన రూ.20 కోట్లు కూడా అందించలేదు. ఈ రెండు జాబితాలకు సంబంధించి కేంద్ర కరువు బృందాలు జిల్లాకు వచ్చి వెళ్లినా పైసా కూడా విడుదల చేయకపోవడం గమనార్హం. ఇదే కాదు...'అన్నదాత సుఖీభవ' లేదు, పంటల బీమా కింద పరిహారం అందలేదు. రైతు ఆత్మహత్యలకు సంబంధించి బాధిత కుటుంబాలకు పరిహారం ఇవ్వలేదు. ఇలా గత 10 నెలల నుంచి నయాపైసా ఇవ్వకుండా నిలువునా మోసం చేస్తున్నారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగిన పంట నష్టానికి సీజన్ ముగిసేలోపు ఇన్‌పుట్ సబ్సిడీ అందించి ఆదుకుంది. అలాగే క్రమం తప్పకుండా రైతు భరోసా, ఉచిత పంటల బీమా కింద పరిహారం పెద్ద ఎత్తున అందించి చేయూతనిచ్చింది.

సాయినామం.. బృందగానం



సంగీత కచేరీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

ప్రశాంతి నిలయం: సత్యసాయి బోధించిన ప్రేమ, సేవ తత్వాలను వివరిస్తూ విద్యార్థులు చేసిన బృందగానంతో భక్తులు మైమరచిపోయారు. సోమవారం సాయికుల్వంత్ సభా మందిరంలో అనంతపురం సత్యసాయి క్యాంపస్ విద్యార్థినులు సంగీత కచేరీ నిర్వహించారు. చక్కటి గీతాలతో భక్తులను ఆధ్యాత్మిక సాగరంలోకి తీసుకెళ్లారు.

ఈద్గాల వద్ద పటిష్ట బందోబస్తు



ఈద్గాల వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

పుట్టపర్తి టౌన్: రంజాన్ పండుగ నేపథ్యంలో సోమవారం జిల్లా వ్యాప్తంగా ఉన్న మసీదులు, ఈద్గాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ముస్లింల ర్యాలీలు, ప్రార్థనలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూశారు. అలాగే వాహన రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

అల్లా హు అక్బర్



పెనుకొండలో చిన్నారుల ఆలింగనం

ఈద్–ఉల్– ఫితర్ (రంజాన్) సందర్భంగా జిల్లాలో సోమవారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. వివిధ ప్రాంతాల్లోని ఈద్గాలు, మసీదుల్లో నిర్వహించిన సామూహిక ప్రార్థనల్లో ముస్లింలు భారీగా పాల్గొన్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పెద్దలు, తల్లిదండ్రుల పట్ల విధేయత చూపాలని, మత సామరస్యం, సోదరభావం, సౌభ్రాతృత్వం పెంపొందించుకోవాలని మత పెద్దలు సందేశం ఇచ్చారు. మత సామరస్యాన్ని చాటుతూ ఇచ్చిన విందుల్లో హిందువులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నేతలు ముస్లింలకు ఈద్ శుభాకాంక్షలు తెలిపారు. కాగా, వక్ఫ్ చట్టాల సవరణలను నిరసిస్తూ పలువురు ముస్లింలు నల్లబ్యాడ్జిలు ధరించి ప్రార్థనల్లో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రమాదకర బిల్లును వెనక్కు తీసుకోవాలని డిమాండు చేశారు. – సాక్షి బృందం, శ్రీసత్యసాయి జిల్లా



కదిరి ఈద్గా మైదానంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ధర్మవరంలో సామూహిక ప్రార్థనలు చేస్తున్న దృశ్యం





హిందూపురంలో రంజాన్ సందేశం ఇస్తున్న మతపెద్ద మౌలానా అబ్దుల్ మన్నన్, ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

క్లుప్తంగా

3న క్యాన్సర్ ఉచిత స్క్రీనింగ్

పుట్టపర్తి టౌన్: సత్యసాయిబాబా పూర్వ విద్యార్థుల సౌజన్యంతో నిర్వహిస్తున్న శ్రీసత్య సాయి పాలియేటివ్ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 3న ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 3 గంటల వరకు ఈ శిబిరం ఉంటుంది. 35 సంవత్సరాలు పైబడిన మహిళలు 080 4710 3700కు కాల్ చేసి ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలి. ఎస్ఎంఎస్ ద్వారా అపాయింట్మెంట్ ఇస్తారు. అలాగే ప్రతి నెలా మొదటి గురువారం స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పుట్టపర్తికి 50 కిలోమీటర్ల పరిధిలో నివాసముంటున్న 750 మందికి క్యాన్సర్‌తో పాటు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి వారి ఇళ్ల వద్ద, కేంద్రంలో ఉచితంగా చికిత్స అందించనున్నారు.


మిద్దెపై నుంచి పడి వీఆర్ఏ మృతి

లేపాక్షి: స్థానిక పంచాయతీ పరిధిలో వీఆర్ఏగా పనిచేస్తున్న రామాంజినప్ప(42) మిద్దెపై నుంచి కింద పడి మృతి చెందాడు. ఆయనకు భార్య, ఓకుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు తెలిపిన మేరకు.. ఆదివారం రాత్రి ఇంటి విషయంలో తన సోదరుడు అశ్వత్థప్పతో రామాంజినప్పకు గొడవ జరిగింది. ఈ సందర్భంగా చోటు చేసుకున్న తోపులాటలో ప్రమాదవశాత్తు రామాంజినప్ప మిద్దెపై నుంచి కిందపడి మృతి చెందాడు. మృతుని భార్య రాధమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు.

పలువురిపై పోక్సో కేసు నమోదు

నల్లమాడ: మైనర్ బాలికను వేధింపులకు గురిచేసిన యువకుడితో పాటు, అండగా నిలిచిన మరో నలుగురిపై పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలను సీఐ నరేంద్రరెడ్డి వెల్లడించారు. నల్లమాడ మండలంలోని రెడ్డిపల్లికి చెందిన సోము కొంతకాలంగా ఇదే మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలిక వెంటపడి ప్రేమ, పెళ్లి పేరుతో వేధించేవాడు. పలుమార్లు ఆ బాలిక వారించినా వినకుండా తరచూ వెంటపడేవాడు. ఆరు నెలల క్రితం కూడా ఆ యువకుడు మద్యం మత్తులో సెల్ టవర్ ఎక్కి నానా హంగామా సృష్టించాడు. ఆ సమయంలో పోలీసులు చాకచక్యంతో వ్యవహరించి అతడిని కిందకు దించారు. ఈ క్రమంలో యువకుడి వేధింపులు తారాస్థాయికి చేరుకోవడంతో తల్లిదండ్రులతో కలసి బాలిక సోమవారం నల్లమాడ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేసింది. దీంతో సోముతో పాటు అతడిని ప్రోత్సహించిన ఆ కుటుంబంలోని మరో నలుగురిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రైతు కన్నీరు



కుసుకుంట్ల వద్ద సాగునీరు చాలక వాడుపట్టిన చీనీ తోట

కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన పండ్ల తోటలు ఎండుతున్నాయి. వర్షాభావ పరిస్థితులు రైతుల ఆశలను చిదిమేశాయి. భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. వ్యవసాయబోర్లు ఒట్టిపోతున్నాయి. పంటలను రక్షించుకునేందుకు కొత్తగా బోర్లు వేద్దామనుకుంటే నిరాశే ఎదురవుతోంది. వెయ్యి అడుగుల దాకా తవ్వినా నీటి చెమ్మ కనిపించడం లేదు.

- వర్షాభావంతో అడుగంటుతున్న భూగర్భజలాలు
- వెయ్యి అడుగులు తవ్వినా కనిపించని నీటిజాడ
- ఎండుతున్న చీనీ, మామిడి, అరటి తోటలు
- పంటలు కాపాడుకునేందుకు రైతుల అగచాట్లు



కుసుకుంట్ల వద్ద ఎండిన అరటి పంట



800 అడుగుల లోతు తవ్వినా చుక్కనీరు పడని బోరు



భూగర్భ జలాలు అడుగంటడంతో తక్కువ నీరు వస్తున్న బోరు

తాడిమర్రి: ధర్మవరం నియోజకవర్గంలోని తాడిమర్రి మండలంలో ఉద్యాన పంటలు విరివిగా సాగవుతున్నాయి. ఇక్కడి ఎర్రనేలల్లో పండే చీనీ, అరటి, మామిడి, దానిమ్మ తదితర పంటలు నాణ్యతతో పాటు రుచికరంగా ఉంటుండటంతో వ్యాపారులే తోటల వద్దకు వచ్చి కొంటుంటారు. గత కొన్నేళ్లుగా కుసుకుంట్ల, రామాపురం, శివంపల్లి, చిల్లకొండయ్యపల్లి, తాడిమర్రి, మోదుగులకుంట, ముద్దులచెరువు, పుల్లానారాయణపల్లి గ్రామాల్లో చీనీ, దాడితోట, చిల్లవారిపల్లి, నాయనిపల్లి, తురకవారిపల్లి, ఏకపాదంపల్లి తదితర గ్రామాల్లో అరటి సాగు చేస్తున్నారు. వ్యవసాయ బోర్ల ద్వారా నీటిని అందిస్తూ మేలైన దిగుబడులు సాధిస్తూ వస్తున్నారు. గత ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో భూగర్భజలాలు అమాంతం పడిపోయాయి. బోర్లల్లో నీరు తగ్గిపోవడంతో తోటలు ఎండుముఖం పట్టాయి. 20 ఏళ్లపాటు ఫలసాయం అందిస్తున్న తోటలను కాపాడుకోవడానికి రైతులు కొత్తగా బోర్లు వేస్తున్నారు. ఒక దాని తర్వాత మరొకటి వేసుకుంటూ పోతున్నారు. రైతుల శక్తి మేరకు 800 నుంచి 1000 అడుగుల వరకు తవ్వించినా నీరు పడటం లేదు. బోర్ల తవ్వకం కోసం చేసిన అప్పులు ఒక వైపు.. ఎండిపోతున్న పంటలు మరోవైపు రైతులను మనోవేదనకు గురిచేస్తున్నాయి.

పంట కోత.. గుండె కోత..

వ్యవసాయ బోర్లు వట్టి పోతుండటంలో మిశ్రమ పంటలు వేసిన రైతుల పరిస్థితి మరీ దయనీయంగా మారింది. ఒక పంటకు నీరందించాలంటే మిగిలిన పంటలను ఎండబెట్టాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కుసుకుంట్లలో ఓ రైతు తనకున్న ఐదెకరాల్లో చీనీ, 4 ఎకరాల్లో అరటి, రెండెకరాల్లో కళింగర సాగుచేశాడు. ఉన్నట్టుండి రెండు బోర్లల్లో నీటిమట్టం తగ్గిపోయింది. దీంతో ఆ రైతు చీనీ చెట్లను కాపాడుకునేందుకు మిగిలిన రెండు పంటలను వదిలేశాడు.

- మరో రైతు రెండెకరాల్లో చీనీ, రెండెకరాల్లో అరటి సాగు చేశాడు. రెండు బోర్ల ద్వారా పంటలకు నీరందించేవాడు. అయితే కొంతకాలంగా బోర్లలో నీరు తగ్గడంతో రెండు పంటలకు చాలడం లేదు. దీంతో ఆ రైతు చీనీ పంటను కాపాడుకోవడానికి అరటికి నీరు పెట్టడం మానేశాడు. ఇలా ఈ ఇద్దరే కాదు వందలాది మంది రైతులు చీనీ, అరటితో పాటు అంతర పంటలుగా టమాట, దోస, కళింగర, మిరప సాగు చేశారు. భూగర్భజలాలు అడుగంటిన తరుణంలో చీనీ కోసం ఇతర పంటలకు నీటి తడులు ఇవ్వలేకపోతున్నారు. మరికొందరు రైతులు ట్యాంకరు నీటికి రూ.700 చొప్పున చెల్లించి పంటలను కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. 5 ఎకరాలు ఉన్న రైతు రోజుకు రూ.4,200 ఖర్చు చేసి ఆరు ట్యాంకర్లతో నీరు తోలిస్తున్నారు.

తాడిమర్రి మండలంలో పండ్ల తోటల వివరాలు (ఎకరాల్లో)

పంట	ఎకరాలు
మామిడి	500
చీనీ	8,580
అరటి	500
దానిమ్మ, ఇతర	100

భూగర్భజలాలు పడిపోయాయిలా..

తాడిమర్రి మండలంలో భూగర్భజలాలు దారుణంగా పడిపోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. గత ఏడాది జూన్ నుంచి మార్చి వరకు 431.5 మి.మీ. సాధారణ వర్షానికి గాను 518 మి.మీ కురిసింది. అయితే ఒకే విడతలో వర్షం కుమ్మేసింది. ఆ తర్వాత వరుణుడు ముఖం చాటేశాడు. ఫలితంగా భూగర్భజలాలు ఎక్కువ కాలం నిల్వ ఉండలేక పోయాయి. దీంతో బోరుబావుల్లో నీరు అడుగంటి పంటలకు పూర్తిస్థాయిలో చేరని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో పంటలు కాపాడుకోవడం రైతులకు కష్టతరమైంది.

ఐదు బోర్లు వేసినా చుక్కనీరు లేదు



నేను 5 ఎకరాల్లో చీనీ, 4 ఎకరాల్లో అరటి, 2 ఎకరాల్లో కళింగర పంటలు సాగు చేశాను. అయితే ఉన్నఫళంగా బోరు బావుల్లో నీటి మట్టం తగ్గిపోయింది. పంటలను కాపాడుకోవాలని రూ.5లక్షలు వెచ్చించి ఐదు బోర్లు వేయించాను. చుక్కనీరు పడలేదు. అరటి, కళింగర పంటలకు నీరందకపోవడంతో రూ.10 లక్షల వరకు నష్టపోయాను. చెట్లను కాపాడుకునేందుకు రోజుమార్చిరోజు రూ.4,200 ఖర్చు చేసి ట్యాంకర్‌తో నీటిని తోలిస్తున్నాను.

– నల్లాపురం బాల రమణారెడ్డి, రైతు, కుసుకుంట్ల

కోతకు వచ్చిన పంట వదిలేశా



వర్షాభావ పరిస్థితుల వల్ల బోరు బావుల్లో నీటి మట్టం పూర్తిగా తగ్గింది. దీంతో చీనీ చెట్లను కాపాడుకోవడానికి రూ.2 లక్షలు ఖర్చుచేసి రెండు బోర్లు వేయించాను. చుక్క నీరు పడలేదు. దీంతో చేసేదిలేక కోతకు వచ్చిన అరటి పంట వదిలేయాల్సి వచ్చింది. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి. – మల్లికార్జున, రైతు, కుసుకుంట్ల

ఎడాపెడా బోర్లు వేయొద్దు

పంటను కాపాడుకోవాలనే తాపత్రయంతో రైతులు ఎడాపెడా బోర్లు తవ్వించరాదు. ప్రభుత్వ జియాలజిస్ట్‌ల ద్వారా పాయింట్లను ఏర్పాటు చేసి బోర్లు వేయించుకోవాలి. అలాగే చీనీ చెట్లను మరికొంత కాలం కాపాడుకునేందుకు చెట్లకు ఉన్న కాయలను వెంటనే తొలగించాలి. అలాగే నీటిలో యూరియాను కలిపి పిచికారీ చేస్తే మరింత కాలం కాపాడుకోవచ్చు.

– అమరేశ్వరి, ఉద్యాన అధికారి, ధర్మవరం

'కర్ర' పెత్తనం..

విరిగిన విద్యార్థిని భుజపుటెముక

- ఆత్మకూరు జెడ్పీహెచ్ఎస్ పరీక్ష కేంద్రంలో ఘటన
- పదో తరగతి పరీక్షలు రాస్తుండగా గిరిజన విద్యార్థినిని కర్రతో కొట్టిన కేంద్రం చీఫ్
- ఎక్స్‌రేలో బహిర్గతమైన దుర్మార్గం



నొప్పి తాళలేక రోదిస్తున్న శ్రావణి



ఎముక విరిగినట్లుగా ఎక్స్‌రేలో కనిపిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పరీక్ష కేంద్రం చీఫ్ సాగించిన 'కర్ర' పెత్తనం ఓ గిరిజన విద్యార్థిని ఉజ్వల భవితకు ఆటంకంగా మారింది. చీఫ్ సూపరింటెండెంట్ విచక్షణ కోల్పోయి కర్రతో కొట్టడంతో విద్యార్థిని భుజపుటెముక విరిగి చివరి పరీక్ష రాయలేక సతమతమవుతోంది. ఆత్మకూరు జెడ్పీహెచ్ఎస్ పరీక్ష కేంద్రంలో చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి 'శ్రీనివాసా! ఇదెక్కడి 'కర్ర'పెత్తనం' శీర్షికన సోమవారం 'సాక్షి'లో వెలువడిన కథనం తెలిసిందే. ఆత్మకూరు మండలం వేపచెర్ల ఎగువతండాకు చెందిన రవినాయక్ కుమార్తె శ్రావణి స్థానిక కేజీబీవీలో పదో తరగతి చదువుతోంది. ఈ క్రమంలో గత కొన్ని రోజులుగా స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లోని కేంద్రంలో ఆమె పరీక్షలు రాస్తోంది. శనివారం పరీక్ష రాస్తూ జవాబు తోచక దిక్కులు చూస్తున్న శ్రావణిని అక్కడకు చేరుకున్న ఆ కేంద్రం చీఫ్ శ్రీనివాసప్రసాద్ (ఆత్మకూరు జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం) కర్రతో కొట్టాడు. నొప్పి తాళలేక ఆమె విలవిల్లాడుతూ.. 'సార్ కొట్టకండి' అంటూ ప్రాధేయపడిన వినకుండా పదేపదే కర్రతో కొట్టడంతో బాలిక తీవ్రంగా గాయపడింది. పరీక్ష ముగిసిన తర్వాత కేజీబీవీకి చేరుకున్న ఆమె జరిగిన విషయాన్ని తన తండ్రికి తెలపడంతో ఆయన ఆదివారం వచ్చి కుమార్తెకు స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించాడు. ఆ సమయంలో తాను పరీక్ష రాయనంటూ బాలిక మొండికేయడంతో మంగళవారం చివరి పరీక్ష ఒక్కటి రాయాలని తండ్రి సముదాయించడంతో సరేనని ఒప్పుకుంది. అయితే రాత్రికి నొప్పి తీవ్రత మరింత ఎక్కువ కావడంతో సమాచారం అందుకున్న రవినాయక్ సోమవారం ఉదయం కుమార్తెను అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రికి పిలుచుకెళ్లాడు. అనుమానం వచ్చిన వైద్యులు ఎక్స్‌రే తీయించడంతో కుడిచేతి భుజపుటెముక విరిగినట్లుగా స్పష్టంగా కనిపించింది. దీంతో శ్రావణి కుడి చేతికి కట్టు కట్టి పంపించారు. చివరి పరీక్ష రాసేందుకు వీలు కాని పరిస్థితిలో ఉన్న బాలిక దుస్థితిపై ఎంఈఓ నరసింహారెడ్డిని వివరణ కోరగా... 9వ తరగతి విద్యార్థిని సహాయకురాలిగా ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కాగా, శ్రీనివాస ప్రసాద్ వారం రోజుల క్రితం కూడా కురుగుంటకు చెందిన పదో తరగతి విద్యార్థినిని కొట్టారని, మరో ఇద్దరు విద్యార్థులు అత్యవసరంగా బాత్రూమ్‌కు వెళ్లి వస్తుండగా వారిని పరీక్ష రాయనీయకుండా దాదాపు అరగంటకు పైగా తన గదిలోనే నిలబెట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. శ్రావణి విషయం తెలియగానే ఆత్మకూరు వాసులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులు తప్పు చేస్తే సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించి చర్యలు తీసుకోవాల్సి ఉండగా, ఇందుకు విరుద్ధంగా ఎముకలు విరిగేలా కర్రతో కొట్టడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

నేత్రపర్వం.. నెట్టికంటుడి రథోత్సవం



రథంపై కొలువుదీరిన సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తులు



రథోత్సవంలో పాల్గొన్న వేలాది మంది భక్తులు

గుంతకల్లు రూరల్: ఉగాది ఉత్సవాల్లో భాగంగా ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం స్వామివారి రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. సోమవారం వేకువజామునే నెట్టికంటి ఆంజనేయస్వామి మూలవిరాట్‌కు అర్చకులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, విశేష అలంకరణ చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ వేలాది మంది భక్తులు బారులు తీరి స్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రధాన గోపురం ఎదుట రథాన్ని నిలిపి రథాంగహోమం, బలిహరణ పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పుష్పాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయ స్వామి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తీసుకువచ్చి రథంపై కొలువుదీర్చారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఆలయ ఈఓ కె.వాణి, అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ.. నారికేళాలను సమర్పించి రథాన్ని ముందుకు లాగి ఉత్సవాని ప్రారంభించారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుటుంబ సమేతంగా సోమవారం సాయంత్రం స్వామిరి వారిని దర్శించుకున్నారు.



కోలాటం ఆడుతున్న మహిళలు, చిన్నారులు

రిమాండ్‌కు ముగ్గురు

అనంతపురం: రాప్తాడు మండలం జి.కొత్తపల్లి మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డిపై దాడి చేసిన ఘటనలో ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు సీఐ సాయినాథ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఆత్మకూరు మండలం వడ్డుపల్లి గ్రామానికి చెందిన చింతపంటి పోతిరెడ్డి కుమారులు దివాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డికు, అనంతపురం నగరానికి చెందిన ఫణీంద్రచౌదరికు వడ్డుపల్లి గ్రామంలో ఓ భూమి విషయంగా వివాదం ఉంది. ఇందులో ఫణీంద్రచౌదరికి మద్దతునిస్తూ గాండ్లపర్తి మోహన్‌రెడ్డి అన్ని విధాలుగా ప్రోత్సహిస్తూ వచ్చాడు. దీంతో మోహన్‌రెడ్డిపై దివాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి పథకం ప్రకారం ఆయనపై దాడి చేసి, గాయపరిచారు. ఈ ఘటనలో పరోక్షంగా సహకరించిన వడ్డుపల్లి గ్రామానికి చెందిన చింతపంటి శివారెడ్డితో పాటు దివాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డిను అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

పోలీసుల శవ పంచాయితీ!

సభ్య సమాజం తలదించుకునేలా పోలీసులు వ్యవహరించారు. జనావాస ప్రాంతంలో పడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని మార్చురీకి తరలించి, కేసు నమోదు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం కనబరిచారు. అక్కడితో ఆగకుండా మృతదేహం పడిన చోటు తమది కాదంటే తమది కాదని రెండు స్టేషన్ల సిబ్బంది ప్రజల సమక్షంలోనే వాగ్వాదానికి దిగారు. దీంతో మృతదేహం జనావాస ప్రాంతంలోనే గంటల తరబడి ఉండిపోయింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి వివరాలు...

- ఆదివారం ఉదయం మృతదేహం గుర్తింపు
- రెండు పోలీసు స్టేషన్ల సరిహద్దున గుర్తు తెలియని వ్యక్తి మృతి
- తమ పరిధి కాదంటే తమది కాదని పోలీసుల వాగ్వాదం
- రెవెన్యూ అధికారుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం



మామిళ్లకుంట క్రాస్ వద్ద రోడ్డుపై పడిఉన్న శవం

పుట్టపర్తి టౌన్: మండలంలోని మామిళ్లకుంట క్రాస్ వద్ద ప్రధాన రోడ్డుపై ఆదివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి నడుచుకుంటూ వెళుతూ కుప్పకూలి మృతిచెందాడు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహం తల కొత్తచెరువు పీఎస్ పరిధిలో, మిగిలిన శరీరం పుట్టపర్తి రూరల్ పీఎస్ పరిధిలో ఉన్నాయి. దీంతో తమ పరిధిలోకి రాదంటూ కొత్తచెరువు పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న పుట్టపర్తి రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. తల కొత్తచెరువు పీఎస్ పరిధిలో ఉండడంతో ఈ కేసు తమ పరిధిలోకి రాదంటూ వారూ వెళ్లిపోయారు.

సాయంత్రం వరకూ తెగని పంచాయితీ..

తమ పరిధి కాదంటే తమది కాదంటూ పోలీసులు వెళ్లిపోవడంతో స్థానికులు తీవ్ర అసహనానికి గురయ్యారు. కాగా, మృతి చెందిన వ్యక్తి కొంత కాలంగా ఆ ప్రాంతంలో సంచరిస్తున్నట్లుగా స్థానికులు గుర్తించారు. రోజూ మద్యం మత్తులోనే ఉండే వాడని తెలిసింది. ఈ క్రమంలోనే ఆదివారం అతిగా మద్యం సేవించిన వ్యక్తి... మధ్యాహ్నం 12 గంటల సమయంలో దాహంతో అలమటిస్తూ జనావాసాల మధ్యనే రోడ్డుపై కుప్పకూలి మృతి చెందినట్లుగా సమాచారం. స్థానికులు ఫోన్ చేయగానే ముందుగా కొత్తచెరువు.. తర్వాత పుట్టపర్తి పోలీసులు వచ్చి తమ పరిధి కాదంటే తమ పరిధి కాదని వెళ్లిపోయారు. దీంతో గ్రామ పెద్దలు జోక్యం చేసుకుని రెండు మండలాల పోలీసులను పిలిపించి మాట్లాడారు. ఆ సమయంలో గ్రామస్తుల మధ్యలోనే పోలీసుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. చివరకు రెండు ప్రాంతాలకు చెందిన వీఆర్వోలు, సర్వేయర్లను పిలిపించి నడిరోడ్డుపైనే పంచాయితీ నిర్వహించారు. రెవెన్యూ మ్యాప్ పరిశీలించి కొత్తచెరువు మండలం లోచర్ల పరిధిలోకి వస్తుందని సర్వేయర్లు తేల్చడంతో కొత్తచెరువు పోలీసులు శవ పంచనామా నిర్వహించి, సాయంత్రం గ్రామ శ్మశాన వాటికలో ఖననం చేయించారు.

కనిపించని కన్నీటి వ్యథ



కనుకూరు వద్ద కంపచెట్ల నీడలో ఊయల వేసి పసిపాపను నిద్రపుచ్చుతున్న తల్లి



మండుటెండలోనే కంపచెట్లను కొడుతున్న పిల్లల తండ్రి

ఊరు కాని ఊరు! రాష్ట్రం కాని రాష్ట్రం... బతుకు తెరువు కోసం వలస వచ్చారు. మండుటెండలోనే కంపచెట్ల నీడనే ఆవాసంగా మార్చుకున్నారు. కంపచెట్లను నరికి బొగ్గుగా మార్చి జీవనోపాధి పొందుతున్నారు. ఇది మహారాష్ట్ర ప్రాంతం నుంచి వలస వచ్చిన 50 కుటుంబాల దీనగాథ. శెట్టూరు మండలం కనుకూరు గ్రామ శివారున చిట్టడవిని తలపిస్తున్న కంపచెట్లలో పాములు, తేళ్లు.. అడవి జంతువులతో సహవాసం సాగిస్తున్నారు. వీరిని పని కోసం పిలుచుకొచ్చిన వారు... కూలీలు ఉండేందుకు ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు. కనీసం తాగునీటి వసతి కూడా ఏర్పాటు చేయలేదు. ఎంత కూలి ఇస్తున్నారో కూడా తెలియదు. రాత్రయితే ఓ చిన్నపాటి గుడారం వేసుకుంటారు. చీకట్లోనే ఆ పూట గడిపేస్తున్నారు. ఇది వలస కూలీల దీనగాథ.. పాలకులకు కనిపించని కన్నీటి వ్యథ. – శెట్టూరు:

సాక్షి ఉద్యోగ అవకాశాలు ప్రతి మంగళ, శుక్రవారములలో

WANTED TEACHERS
Trained Experienced Graduates with D.Ed. (or) B.Ed. fluency in English to teach English, Mathematics, General Science, Social Studies, Physics, Telugu, Hindi and Computer Instructor to the Classes I to X. Pre-Primary (KG Teachers) Classes and Librarian. Submit the Bio-Data and Xerox copies of certificates on before: 05-04-2025.
Walk in INTERVIEW & EXAM : 10-4-2025
Written Exam at 8-30 A.M. To 12-00 P.M. and Demo 1-00 PM. To 4-00 P.M.
Note : We Prefer English Medium Teachers
ST.VINCENT DE PAUL EM HIGH SCHOOL
Beside RDT Stadium, Bangalore High Way, Pangal Road, RAPTHADU, Anantapuramu Dist.
Contact Ph.: 08554-293367 Mobile : 6300624830, 9381215165.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
DSC కోచింగ్
QUANTUM INDIA - DSC కోచింగ్: ఫిజికల్‌సైన్స్ S.A మాత్రమే. కెమిస్ట్రీ, ఫిజిక్స్ (ఇంటర్ + సిలబస్). కంటెంట్ మాత్రమే: కెమిస్ట్రీ, ఫిజిక్స్ మరియు రెండు కలిపి. 2వ రోడ్డు, ATP. 9618562274. [A-50]

WANTED
తాడిపత్రి హాస్పిటల్ లో పని చేయుటకు క్వాలిఫైడ్ లేదా ట్రైనీ నర్సులు కావలెను. సంప్రదించండి సెల్: 7416964894. [SCA25002495]
SAEEసర్వీసెస్,తిరుమల తిరుపతి పరిసర ప్రాంతములలో సెక్యూరిటీ గార్డ్సుగా పనిచేయుటకు (Male) కావలెను.జీతం:Upto15,000/- భోజనము వసతి కలదు. 9246803657, 8019956289. [T-2386]
అనంతపురం గార్లదిన్నెలో పనిచేయుటకు Ex.-సర్వీస్ మాన్ సెక్యూరిటీ గార్డులు కావలెను. జీతం: 16,650+PF 3,600/-, 8 hrs, 26 రోజులు డ్యూటీ. ©: 88857 68111 [R-141]
లేడి టెలికాలర్స్ కావలెను. విద్యార్హత తో పనిలేదు. # రిలయన్స్ డిజిటల్ బ్యాక్ సైడ్, టవర్ క్లాక్ దగ్గర, ATP. 9980713022,8639842489 [A-761]
పూజారి కావలెను. శ్రీ గౌతమేశ్వర దేవస్థానము, గుత్తి R.S, నందు పనిచేయుటకు పూజారి కావలెను. మంచి జీతం + వసతి కలదు. సెల్: 9490856199, 9704575707 [A-1554]
మీ ఇంటివద్దనే వుంటూ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం: 25-30వేల వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్: 95504 67459. [SCA 25002418]
ATP లో జాబ్ చేయుటకు టెన్త్ టు పీజీ అర్హత కలిగిన యువతీ, యువకులుకు ఆఫీస్, స్కూల్స్, కాలేజస్, హాస్పిటల్, షాపింగ్ మాల్ మరియు ఇతర కంపెనీస్ నందు జాబ్స్ కలవు సంప్ర : 8328522802. [SCA25002497]
త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18k. ఫోన్: 9640400073, 9160900024 [SCA25002453]

ప్రకటన గోరంత ! స్పందన కొండంత !!
4 లైన్లు రూ: 270/-
అదనపు లైను రూ: 60/-
ప్రతి 3 ప్రకటనలకు 1 ప్రకటన ఉచితం
ANANTHAPURAMU : 9010567770, 9492288307
DHARMAVARAM & PUTTAPARTHI : 9912220726, 7093150088
HINDUPUR & MADAKASIRA : 9912220723
GUNTAKAL & TADIPATRI : 9912220722
KADIRI : 7093150088
RAYADURG : 9010470185

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.